# వరంగల్ వాయిస్
*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 20
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
సెప్టెంబర్ 30, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




వడ్డేపల్లి కళాశాలలో

## బీజేపీ నేతల పరిశీలన

స్థానికుల సమాచారం మేరుకు సమస్యలపై ఆరా..

8లో..



# ఆక్రమణదారుల్లో హైడ్రా టెన్షన్

- చిట్టా రెడీ చేసిన బల్దియా
- నగరంలో పలు చెరువులు, కుంటల కబ్జా
- ఇప్పటికే పలువురికి నోటీసులు
- ఏ క్షణంలోనైనా కూల్చివేతలు
- ఆందోళనలో కొనుగోలు దారులు



వివరాలు2లో..

రాష్ట్ర రాజధానిలో కొనసాగుతున్న హైడ్రా దూకుడుతో వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని ఆక్రమణ దారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లోని చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిలో టెన్షన్ మొదలైంది. ఇప్పటికే దూకుడు పెంచిన బల్దియా అధికారులు నగరంలోని 170కి పైగా చెరువులు, కుంటలు కబ్జాకు గురైనట్లు లెక్కలు తేల్చారు. అంతే కాకుండా ఇటీవల జరిగిన వరంగల్ మహానగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలోనూ జిల్లా మంత్రి కొండా సురేఖ అక్రమ నిర్మాణాల నిగ్గు తేల్చేందుకు తీర్మాణం కూడా చేసినట్లు ప్రకటించారు. చెరువులు, కుంటలు, నాళాల ఆక్రమణలతోనే చిన్నపాటి వర్షానికి నగరం జలమయంగా మారుతోందని, పలు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని ఆమె తేల్చి చెప్పారు. అందులో భాగంగానే ఎఫ్ టీఎల్ పరిధిలోని పలువురు గృహ నిర్మాణ యజమానులకు బల్దియా తాఖీదులు కూడా జారీ చేసింది. దీంతో అక్రమ నిర్మాణాలు కూల్చివేత పక్కా అని తేలిపోయింది. ఏ క్షణంలోనైనా కూల్చివేతలు జరుగొచ్చన్న ఆందోళన గృహ యజమానుల్లో నెలకొంది.

- వరంగల్ వాయిస్, వరంగల్



8లో..

కాంగ్రెస్, బీఆర్ఎస్

## బాహాబాహీ

- నయీమ్ నగర్ బ్రిడ్జిపై కొట్టుకున్న నేతలు
- రంగ ప్రవేశం చేసిన పోలీసులు
- వినయ్ భాస్కర్ అరెస్ట్, పోలీస్ స్టేషన్ తరలింపు



8లో..

## ఇంటికి ఆధారం ఇల్లాలే..

- ఆరోగ్యం విషయంలో అవగాహన పెంచుకోవాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



8లో..

## మీ సేవలు.. నేటి తరానికి స్ఫూర్తిదాయకం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

# ఆక్రమణదారుల్లో హైడ్రా టెన్షన్



- చిట్టా రెడీ చేసిన బల్దియా
- నగరంలో పలు చెరువులు, కుంటల కబ్జా
- ఇప్పటికే పలువురికి నోటీసులు
- ఏ క్షణంలోనైనా కూల్చివేతలు
- ఆందోళనలో కొనుగోలు దారులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాకతీయ రాజులు పరిపాలించిన ఓరుగల్లు నగరం వందలాది గొలుసు కట్టు చెరువులకు ప్రతీక. ఇందులో చిన్న కుంటలు, పెద్ద చెరువులు అనేకం ఉన్నాయి. ఎక్కడ కూడా వరద ముంపు ఏర్పడకుండా ఆనాటి రాజులు నిర్మించిన అనేక కుంటలు, చెరువులు నేడు కబ్జా కోరల్లో చిక్కి కనుమరుగయ్యాయి. అనేక కుంటల జాడే లేకుండా పోగా పలు పెద్ద చెరువులు సైతం సగానికి పైగా ఆక్రమణకు గురయ్యాయి. దీంతో తేలిక పాటి వర్షానికే నగరంలోని అనేక ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. ప్రతి ఏడు ఇది సర్వసాధారణంగా మారి పోయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, నాలాల అక్రమణ దారులపై కొరడా జులిపించేలా హైడ్రా ను ప్రవేశపెట్టింది. అయితే దీనిని రాష్ట్ర రాజధానికి మాత్రమే పరిమితం చేసింది. అయితే వరంగల్ లోనూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఇటీవల జరిగిన బల్దియా సర్వసభ్య సమావేశంలో మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. ఈ మేరకు ఒక తీర్మాణం కూడా చేసినట్లు ఆమె వెల్లడించారు. దీంతో దూకుడు పెంచిన బల్దియా అధికారులు నగరంలో ఉన్న చెరువుల ఎఫ్ టీఎల్ ను గుర్తించే పనిలో పడ్డారు. గతంలోనే కొన్ని చెరువులుకు ఎఫ్ టీఎల్ ఏర్పాటు చేసినా తర్వాత దాని గురించి పెద్దగా పట్టించుకోకపోవడంతో గ్రేటర్ అధికారులు ఏర్పాటు చేసిన ఆనవాళ్లు లేకుండా చేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. అదే విధంగా ఎక్కడెక్కడ నాలాలు కబ్జాకు గురయ్యాయో వాటి లెక్కలు కూడా తీస్తున్నారు. వాటిని కూడా తిరిగి స్వాధీనం చేసుకునే పనిలో పడ్డారు.

### లెక్క పక్కా..

వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధిలో కబ్జా కోరల్లో చిక్కిన చెరువులు, కుంటల లెక్కలను బల్దియా అధికారులు పక్కాగా తీశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 42 విలీన గ్రామాలను కలుపుకుని సుమారు 4,994 ఎకరాల్లో 170కి పైగా ఉన్న చెరువులు, కుంటలు విస్తరించి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో వందకు పైగా కుంటలు, చెరువులు కనిపించకుండా పోయాయి. వాటి ఆనవాళ్లు కూడా నేడు దొరకకుండా చేశారు. మిగిలిన చెరువులు, కుంటల్లో దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారు. పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద భవంతులనే నిర్మించారు. అయితే నగరంలోని మిగిలి ఉన్న 75 చెరువులపై నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ల సాయంతో సమగ్ర సర్వే నిర్వహించేందుకు టెండర్లు పిలిచారు. పాత రికార్డుల ప్రకారం ఎన్ని చెరువులు ఉండే..? అవి ఎంత విస్తీర్ణం కలిగి ఉన్నాయి అన్న లెక్కలు తేలుస్తున్నారు. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో చెరువులు, కుంటల పరిస్థితి ఎలా ఉండో పరిశీలిస్తున్నారు. దీని ఆధారంగా ఏ మేరకు కబ్జా జరిగిందో పక్కాగా లెక్కలు వేస్తున్నారు.

### వడ్డెపల్లి చెరువు..

హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు విస్తీర్ణం 556 ఎకరాలు. దీనిలో వంద ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లు అధికారులు లెక్క తేల్చారు. చెరువు కట్టను ఆనుకొని ఎఫ్ టీఎల్ పరిధిలో పెద్ద పెద్ద అపార్ట్ మెంట్లు, ఫంక్షన్ హాల్స్ నిర్మించారు. వీటి విలువ లక్షల కోట్లు చేస్తుంది. అయితే వీటి నిర్మాణం వెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేతలతోపాటు పలువురు బడా బాబులు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అందుకే చెరువు కట్టను కొంత తొలగించి నిర్మాణాలు చేపట్టినా అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడం గమనార్హం. కట్టను పాక్షికంగా తొలగించిన సమయంలో జరుగరానిది ఏదైనా జరిగి ఉంటే హనుమకొండ మొత్తం జలదిగ్బంధనంగా మారి అనేక ప్రాణాలు గాలిలో కలిసేవి. ఇప్పటికైనా ప్రమాదం పొంచి ఉందని తెలిసి నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

### చిన్నవడ్డెపల్లి చెరువు..

దేశాయిపేట ప్రాంతంలోని చిన్నవడ్డెపల్లి చెరువు 70,74 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో 35 ఎకరాలకు పైగా కబ్జాకు గురైందన్న ప్రచారం సాగుతోంది. ఇందులో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు భవంతులు వెలిసాయి. చెరువు ఎఫ్ టీఎల్ పరిధిలోనే అపర్ట్ మెంట్ నిర్మాణం కూడా జరిగింది. అయితే చెరువును ఆక్రమించి 329 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో గతంలోనే కొందరికి నోటీసులు కూడా జారీ చేయడంతోపాటు ఎనిమిది అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఇందులో ఇంకా 200మైగా అక్రమ నిర్మాణాలు ఉన్నప్పటికీ వాటికి ఇంత వరకు ఎలాంటి నోటీసులు జారీ చేయకపోవడం వెనుక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉందన్న ప్రచారం సాగుతోంది.

### భద్రకాళి చెరువు..



నగర ప్రజల దాహార్తిని తీర్చాలన్న లక్ష్యంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ గా మార్చిన భద్రకాళి చెరువు విస్తీర్ణం 496 ఎకరాలు. ఇందులో 70 ఎకరాలకు పైగా కబ్జాకు గురయ్యాయి. ఇందులో రాజకీయ నాయకులకు చెందిన నర్సింగ్ కళాశాలతోపాటు పలు ప్రైవేట్ భవనాలు నిర్మించారు. ఎఫ్ టీఎల్ పరిధిలోనే ఒక విశ్వవిద్యాలయానికి చెందిన భవనాన్ని కూడా ప్రభుత్వం నిర్మించింది. దాని చుత్తు పక్కల ప్రాంతాల్లోని భూములను ఎన్టీఆర్ నగర్ పేరిట పేదలకు పట్టాలు ఇచ్చారు. భద్రకాళి చెరువు పరిధిలో 249 అక్రమ కట్టడాలు నిర్మించినట్లు గుర్తించిన అధికారులు 91 కట్టడాలకు నోటీసులు ఇవ్వగా, 108 కట్టడాలను కూల్చివేశారు. మరికొన్ని కట్టడాలు చెరువులోనే కాలగర్భంలో కలిసిపోయాయి.

### కోట చెరువు..

పైడిపల్లి శివారులోని కోట చెరువు 172 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 70 ఎకరాలకుపైగా కబ్జాకు గురికాగా 150 అక్రమ నిర్మాణాలు వెలిసినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో నాలుగు అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చి వేశారు. అయితే అక్రమణ దారుల్లో సగం మందికి మాత్రమే నోటీసులు జారీ చేసిన అధికారులు మరి కొందరినీ మాత్రం దాటవేసే దోరణిలో వ్యవహరిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

### బంధం చెరువు..

కాజీపేట పరిధిలోని నిట్ ను ఆనుకొని ఉన్న బంధం చెరువు 45 ఎకరాల్లో విస్తరించి ఉండగా అందులో సగానికిపైగా కబ్జాకు గురైంది. ఇందులో 366 అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వీటిలో కొన్నింటికి బల్దియా అధికారులు నోటీసులు జారీ చేశారు. మరికొన్ని నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది స్పష్టత కరువైది.



### ఇతర చెరువులు..

హనుమకొండలోని గోపాల్ పూర్ చెరువు 16 ఎకరాల్లో విస్తరించి ఉండగా దీని నామ రూపాలు లేకుండా పోయాయి. నేడు ఇది కేవలం రెండు ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. ఖిలా వరంగల్ గుండు చెరువు 27 ఎకరాలు, ఉర్సు రంగ సముద్రం 190 ఎకరాలు, తిమ్మపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, రంగశాయిపేత చెరువుతోపాటు ఎల్లాపూర్ లో రెండు చెరువులు, హసన్ పర్తిలో ఏడు చెరువులు, చితగట్టులో మూడు, మునిపల్లి ఒకటి, ఉనికిచెర్లలో ఆరు, మండికొండలో 11, కుమ్మరిగూడెంలో మూడు, రాంపూర్ లో మూడు, తరాలపల్లిలో రెండు, అయోద్యపురంలో ఒకటి, గోపాల్ పూర్ లో మూడు, భట్టుపల్లి చెరువు, బీమారంలో నాలుగు, కోమటి పల్లి చెరువు, దేవన్నపేటలో రెండు, పెగడపల్లిలో మూడు, ముచ్చర్లలో తొమ్మిది, పలివేల్పులలో మూడు, సింగారంలో మూడు, న్యూ శాయంపేటలో రెండు, అమ్మవారిపేటలో రెండు, అల్లీపూర్ లో ఐదు, తిమ్మాపూర్ లో నాలుగు, రంగశాయిపేటలో మూడు, ఖిలావరంగల్ కోటలో మూడు, దూపకుంటలో మూడు, స్తంభంపల్లిలో మూడు, ధర్మారంలో మూడు, గొర్రెకుంటలో నాలుగు, జాన్ పాకలో రెండు, మొగిలిచర్లలో నాలుగు, పైండిపల్లిలో నాలుగు, దేశాయిపేట కుంట, ఆరెపల్లిలో మూడు, వంగపహాడ్ లో మూడు చెరువులు కూడా కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు.



# పాఠశాలలో ముందస్తు బతుకమ్మ

**వరంగల్ వాయిస్, దామెర :** దామెరలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ భేతి కొండల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పేరు చెప్పగానే మొదట గుర్తు వచ్చే పండుగ బతుకమ్మ అని, బతుకమ్మను సహజంగా లభించే పూలతో తయారు చేస్తారని, పువ్వులనే దేవునిగా పూజించే ఏకైక పండుగని, బతుకమ్మలో వాడే పువ్వులకు ఔషధ గుణాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రకృతికి సమర్పిస్తారని, ఒక రకంగా ఇది పర్యావరణ పరిరక్షణకు సంకేతమని, మహిళలు సామూహికంగా పాటలు పాడుతూ పూజలు చేస్తూ స్నేహభావంతో ఉండే వేడుకని తెలియజేశారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు ముందస్తు పండుగ శుభాకాంక్షలు చెప్పారు. విద్యార్థినిలు, మహిళా ఉపాధ్యాయునిలు వేసిన కోలాటం నృత్యాలు, బతుకమ్మ పాటలతో ఆడి పాడిన వారిని అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన రావణాసురవధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇన్చార్జి విజయ్ కుమార్, మహిళా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, సంగెం :** మండల కేంద్రంలో సోమవారం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలను చేసి ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలు ఉపాధి పొంది, ఆదాయాన్ని పెంచుకొని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని తెలిపారు. మహిళామణులు ఈ క్యాంటీన్ బాగా నడుపుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా స్వయం ఉపాధి పొందడానికి స్వశక్తి మహిళలకు మహిళా శక్తి క్యాంటీన్లు ఉపయోగపడతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం 2024-25



వార్షిక బడ్జెట్‌లో మహిళా సాధికారికతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టారని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తుందని రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. అనంతరం సంగెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మిషన్ భగీర పనులు సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి పెట్టిందని, ప్రతీ గ్రామంలో రక్షిత మంచినీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని గ్రామ మంచినీటి సహాయకులు అవగాహనతో ప్రజలకు సేవలందించాలని కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండాఅధికారులు, పారిశుధ్య కార్మికులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ మురుగునీటి నిల్వలు ఉండకూడదని, ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే తద్వారా దోమలు వృద్ధి చెంది వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

# యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల టీఎస్ యూటీఎఫ్ తన నూతన కమిటీని ప్రకటించింది. మండలాధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా శివ ప్రసాద్,కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా గ్రేసమ్మ, షేక్ అమీన్, కార్యదర్శులుగా కోట వెంకన్న, లక్ష్మీ ప్రసాద్, వరలక్ష్మి, సీతారాములు, చంద్రశేఖర్, అనూష, అడిట్ కమిటీ కన్వీనర్ గా శంకరయ్య, మీడియా కన్వీనర్ గా కలపాల అనిత, కల్చరల్ కన్వీనర్ గా సీతారామారావు, జిల్లా డెలిగేట్స్ గా వివేక్, శంకర్, సోమనబోయిన శ్రీనివాస్,షేక్ సాహెబ్ అలీ, అమీనా, శ్రీలక్మి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామా వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వివేక్ లు తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకులు డాక్టర్ రాంచంద్రయ్య, సీనియర్ నాయకులు తుమ్మ వెంకటప్పయ్య, కొత్త గోపిరెడ్డి, నాగేశ్వరరావు, ఎఫ్ డబ్ల్యూ కన్వీనర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# పార్క్ ను సందర్శించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 58వ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి శ్యామల దుర్గాదాస్ పార్క్ ను సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. పార్క్ అన్యాక్రాంతానికి గురవుతుందని ఎమ్మెల్యే దృష్టికి రావడంతో అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే బతుకమ్మ పండుగ సమీపించిన వేళ ఆడపడుచులకు పార్క్ ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, రాత్రి సమయంలో బతుకమ్మ వేడుకలు జరుకుంటారు. కాబట్టి, లైటింగ్ అమర్చాలని కోరారు. పార్కులో అసాంఘిక కలాపాలు జరగకుండా వాచ్ మెన్ ను ఏర్పాటు చేయాలని, పోలీస్ వారు పెట్రోలింగ్ జరపాలని ఆదేశించారు. పార్క్ చుట్టూ సీసీ కెమెరాలు అమర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తాళ్లపల్లి సుధాకర్, పున్నం చందర్, ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు మేరీ, సీనియర్ నాయకులు తాళ్లపల్లి రవీందర్ (జేకే), డిప్యూటీ కమిషనర్ రవీందర్, హార్టికల్చర్ అధికారి రమేష్, కాలనీ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి ఎమ్మెల్యే కడియం ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కుసుమ శ్రీవల్లికి ఇంజినీరింగ్ చదవడానికి సరైన ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి వెళ్లగానే వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థిని చదువుకు అవసరమైన కళాశాల ఫీజును కడియం ఫౌండేషన్ ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా గతంలో బీటెక్ మొదటి సంవత్సరం కళాశాల ఫీజు రూ.35 వేలు అందజేసిన ఎమ్మెల్యే, ఇప్పుడు బీటెక్ రెండవ సంవత్సరానికి సంబంధించిన కళాశాల ఫీజును విద్యార్థిని శ్రీవల్లికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తమ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని తన చదువుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, కడియం ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నడికూడ ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మండలంలోని 14 గ్రామాల పంచాయతీ కార్మికులకు ఉచిత వైద్య, ఆరోగ్య పరీక్షలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. కార్మికులు పారిశుధ్య పనులు చేసేటప్పుడు రక్షణగా గ్లౌవ్స్, షూస్, హెల్మెట్ లు ధరించాలని కోరారు. మండల పంచాయతీ అధికారి చేతన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికులకు రూ.755 సంవత్సరం పాటు ప్రమాద బీమా కల్పిస్తున్నామని తెలిపారు. నడికూడ మండలం లోని 74 మంది పారిశుధ్య కార్మికులకు ఈ ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ, పంచాయతీరాజ్ సిబ్బంది, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ రాజకుమార్, హెల్త్ అసిస్టెంట్లు వేణుగోపాల్, కిషోర్, ఏఎన్ఎంలు భాగ్యలక్ష్మి, కల్పన ల్యాబ్ టెక్నీషియన్, ఆశా వర్కర్లుడాక్టర్ అనూహ్య, రాజ్ కుమార్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, నడికూడ కార్యదర్శి సందీప్, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మరిపెడ విద్యార్థినులు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ మోడల్ స్కూల్ విద్యార్థినులు నందిగామ స్వరూప, జి.లక్ష్మీ నందినిలకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు లభించింది. పురిమళ్ల ఫౌండేషన్, అక్షరాల తోవ ఖమ్మం వారి ఆధ్వర్యంలో పురిమళ్ల ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్షల పోటీలలో మరిపెడ మోడల్ స్కూల్ విద్యార్థినులు నందిగామ స్వరూప, జి.లక్ష్మీ నందినిలు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లోవారికి అరుదైన గౌరవం దక్కింది. ప్రతిభా పురస్కారాలను విద్యార్థినులకు ఖమ్మంలోని మంచి కంటి భవన్ లో నిర్వాహకులు అందజేశారు. సాహిత్యంపై మక్కువతో తెలుగు ఉపాధ్యాయులు నాగ మోహన్ యెలిశాల ప్రోత్సాహంతో పెన్ కౌంటర్, చైతన్య దీపాలు పుస్తకాలపై విద్యార్థినులు రాసిన సమీక్షలు పోటీలో ఉత్తమ స్థానంలో నిలిచి సమీక్షల సమాహారం పుస్తక సంకలనంలో నందిగామ స్వరూప, జి.లక్ష్మీ నందినిలు పోటీల్లో ప్రతిభ చాటారు. విద్యార్థినులను మరిపెడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అక్తర్ రుజ్మాన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# మహిళలతోనే మేలైన ఆహార శుద్ధి

## మహిళలకు అండగా ఆడెపు ఫౌండేషన్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతీ మహిళా ఆరోగ్యకరమైన పోషకాహారాన్నే స్వయంగా తయారు చేసి కుటుంబంలో వడ్డిస్తుందని, అలాంటి స్ఫూర్తి కలిగిన వారు ఆహార శుద్ధి రంగంలోకి ప్రవేశిస్తే సామాజిక ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయని, తద్వారా గణనీయమైన స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ లెవల్ రిసోర్స్ ప్రొఫెషనల్, కేంద్ర ఆహార శుద్ధి, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సలహాదారు డాక్టర్ పోలెపాక మోహన్ పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్ వద్ద వీనస్ పాఠశాలలో ఆడెపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పీఎం ఎఫ్ఎంఈ (ప్రధాన మంత్రి ఫార్మలైజేశన్ ఆఫ్ మైక్రో ఎంట్రప్రెన్యూర్స్) పథకం అందుకు తోడ్పడుతుందని తెలియజేశారు. ఆహార శుద్ధి రంగంలో అనుసరించాల్సిన మెలకువలను వివరించారు. ఫౌండేషన్ చైర్మన్ వెంకటేష్ మాట్లాడుతూ ఈ పథకం కింద మహిళా స్వయం సహాయక సంఘాలు, సభ్యులకు రాయితీపై రుణాలు అందించి క్లస్టర్ డెవలప్ మెంట్ సెంటర్లు, కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పర్చి, సబ్సిడీపై రుణాలిచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. 36వ డివిజన్ నిరుపేద, మధ్యతరగతి



మహిళల సాధికారత కోసం ఫౌండేషన్ కృషి చేస్తుందని చైర్మన్ వెంకటేశ్ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, డ్వాక్రా రుణాలు, ముద్ర రుణాలు, విశ్వకర్మ యోజనలో మహిళలకి కుట్టు మిషన్లు పంపిణీ చేసి కుట్లు, అల్లికలు లాంటివి నేర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తున్నదని తెలిపారు. ఆ ప్రయోజనాలు అందరూ పొందేలా ఫౌండేషన్ తరపున తాము సహాయ సహకారాలు అందిస్తామని వెంకటేశ్ అన్నారు. 36వ డివిజన్ మహిళలు స్వయం ఉపాధి పథకాలు ఉపయోగించుకొని ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శ మహిళా సంఘాల నాయకురాళ్లు, వైద్యులని ఆడెపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

# ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి

## రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎంసీపీఐయూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ తుమ్మల కృష్ణారెడ్డి అధ్యక్షతన కరీంనగర్ లో ఒక ప్రైవేటు కళాశాలలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంసీపీఐ (యూ) పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పూర్తి మెజార్టీ లేక పోయినా అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం, ప్రజలపై అధిక భారాలు వేయటం, ప్రైవేటీకరణ వేగం పెంచటం సంపద కొద్ది మంది వ్యక్తుల దగ్గర పోగు చేయటం, దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు పెరగటం దినం దినం విపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐ, దాడులు పెంచటం, న్యాయ వ్యవస్థలో నిత్యం జోక్యం చేసుకుని రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బ తీస్తూ రాష్ట్రాల హక్కులను హరించే చర్యలకు పూనుకోవడంలో భాగంగా వన్ నేషన్, వన్ ఎలక్షన్ పేరుతో జమిలి ఎన్నికలు తీసుకుని రావటానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన తీరు భారత రాజ్యాంగ లౌకిక, వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని, రాష్ట్రంలో 9నెలల క్రింద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన వాగ్దానాలను అమలు చేయకుండా పక్క దారి పట్టించే చర్యలకు పూనుకోవడం జరుగుతుందని, ఈ విధానానికి వ్యతిరేకంగా కష్టజీవులు అంతా ఏకం బడుగు బలహీన వర్గాల రాజ్యం సాధించినప్పుడే ఈ దోపిడీ అసమానతలు తొలుగుతాయని, అందుకు యంసీపీఐ (యూ) ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమావేశం ఈ క్రింది నిర్ణయాలు చేసింది. కామ్రేడ్ తుమ్మల క్రిష్ణారెడ్డిని ఉమ్మడి జిల్లా ఎంసీపీఐ(యూ) కార్యదర్శిగా ఎన్నుకుంది. సభ్యులుగా కామ్రేడ్ కొండా దినేష్, వలిపిరెడ్డి సరోజ, ఖాజా అజిమొద్దీన్, గడ్డం శ్రీకాంత్, ముదాం రవీందర్, లక్ష్మణ్, తదితరులను ఎన్నుకున్నారు. అక్టోబర్ 20న కరీంనగర్ లో ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక నేత అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి సభను పెద్దఎత్తున కరీంనగర్ లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి తుమ్మల కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు కొండా దినేష్, ఖాజా అజిమొద్దీన్, వలపి రెడ్డి సరోజ, వలపిరెడ్డి లక్ష్మి, ముదాం రవీందర్, బాలయ్య, గడ్డం శ్రీ కాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

## మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** భూపాలపల్లి మాజీ శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ రూరల్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి మండలంలోని వసంతాపూర్, గంగిరేణి గూడెం, సూర్య నాయక్ తండా గ్రామాల్లో శాయంపేట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి పర్యటించి రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో గులాబీ జెండా ఎగరవేసే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ ఆదిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఘంటా శ్యామసుందర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మారేపల్లి నందం, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మేకల శ్రీను, మాజీ ఎంపీటీసీ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్, గజ్జల రాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, మండల ముఖ్య నాయకులు మారేపల్లి మోహన్, మేకల వెంకన్న, కరుణ్ బాబు, మారపల్లి ప్రభాకర్, శంకర్, వసంతపూర్ గ్రామ సీనియర్ నాయకులు ఇటుకల పాపారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, రమేష్, బెజ్జంకి లింగమూర్తి, కోటి లింగాచారి, నాలికరాజు, వైనాల భిక్షపతి, మొండయ్య, సూర్య నాయక్ తండా గ్రామ శాఖ అధ్యక్షుడు లావుడియా రవీందర్, మాలోతు భాస్కర్, బుఖ్య భాస్కర్, తిరుపతి, అమిత్, ధన్ సింగ్, కృష్ణ, రాజు, బాలు నాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

# కేయూ దూరవిద్యా ప్రవేశాల గడువు అక్టోబర్ 15 వరకు పొడగింపు

## సంచాలకులు ప్రొఫెసర్ రామచంద్రం

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ కోర్సులలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు అక్టోబర్ 15 వరకు రోహులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 33 కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని వివరించారు. డిగ్రీలో బీఏ, బీకాం జనరల్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ, బీఎల్ఐ ఎస్సీ, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్మెంట్, సోషియాలజీ, హెచ్ఆర్ఎం, ఎంకామ్, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, గణిత శాస్త్రం, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్రాలు, ఎంఎల్ఐఎస్సీ, ఉన్నాయని డిప్లమా కోర్సులలో కంప్యూటర్ అప్లికేషన్స్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్, యోగా, సర్టిఫికెట్ కోర్సులో సీఎల్ఐసీ, మిమిక్రీలో ఓరియంటేషన్ కోర్సులకు ప్రకటన జారీ చేశామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అవసరమైన సర్టిఫికెట్లు, ఫొటో జత చేసి కోర్సు ఆన్ లైన్ లో గానీ, దూరవిద్యా కేంద్రం ఎస్బీఐ ఎక్స్ టెన్షన్ కౌంటర్ నుంచి చలానా ద్వారా గాని చెల్లించవచ్చున్నారు. కోర్సులు, ఫీజులు మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 0870-2461480,2461490 లలో సంప్రదించాలని ఆచార్య వల్లూరి రామచంద్రం సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశం వినియోగించు కోవాలని కోరారు.

# ఎస్ఎస్ యూ విద్యార్థి పోరు యాత్ర ముగింపు సభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఎస్ఎస్ యూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్ లో పరిరక్షణకై, విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎస్ యూ విద్యార్థి పోరుయాత్రను గత పది రోజుల నుంచి కొనసాగిస్తూ వివిధ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లను సందర్శిస్తూ.. విద్యార్థులను కలుస్తూ హాస్టల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ స్వేరో అన్నారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్ చార్జెస్ పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. అదే విధంగా మరికొద్ది రోజుల్లో చలికాలం మొదలవుతుంది కాబట్టి, విద్యార్థులకు బెడ్ షీట్స్, మ్యాట్రెస్, సొంత భవనం కూడా నిర్మించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హెచ్చరిస్తున్నామన్నారు. అదేవిధంగా గత పది రోజుల నుంచి విద్యార్థులు మా దృష్టికి తీసుకువచ్చిన అనేకమైన సమస్యలను ఉన్నతాధికారులను కలిసి పరిష్కారమయ్యేంత వరకు స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులకు అండగా నిలబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్వేరోస్ రాష్ట్ర ఈసీ మెంబర్ మారపల్లి మనోజ్, స్వేరోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జనగామ జిల్లా అధ్యక్షుడు మాదారపు విజయ్ కుమార్, చెట్టుపల్లి శివకుమార్, సిద్ధు ముగింపు సభలో పాల్గొన్నారు.

# పోస్టర్ ఆవిష్కరించిన కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 36వ డివిజన్ పుప్పాల గుట్టలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు భాగంగా పూజ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ను సోమవారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి సామాజికవేత్త, సుస్మిత గార్డెన్ యజమాని ఎల్ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

# అన్నపూర్ణను కలిసిన టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్లోని తెలంగాణ సహకార యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఇటీవల తెలంగాణ రాష్ట సహకార యూనియన్ లిమిటెడ్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర జాయింట్ రిజిస్టర్ కార్యనిర్వహణ అధికారి వల్లి సహకార శిక్షణ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకన్నలతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ రానున్న రోజులలో తెలంగాణ రాష్టంలోని హౌసింగ్ సొసైటీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాష్ట స్థాయిలో అవగహన సదస్సు ఏర్పాటు చేయాలని కోరగా సొసైటీల నుంచి వచ్చే వినతులను తప్పకుండా పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# ఇమ్మానుయెల్ రాజ్‌కు ఘన స్వాగతం



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు, స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరా కుమారుడు ఇమ్మానుయేల్ రాజ్ లింగాల గణపురం పర్యటనలో భాగంగా విచ్చేసిన సందర్భంగా లింగాల గణపురం మండలం నెల్లుట్ల గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండ్రు శ్రీకాంత్ ఆధ్వర్యంలో యువకులు ఘన స్వాగతం పలికి శాలువలతో సన్మానించారు. ఎల్లప్పుడూ యువకులకు అండగా నిలిచే యువ నాయకులు ఇమ్మానుయేల్ రాజ్ కు తోడుగా నిలబడి, కాంగ్రెస్ పార్టీకి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షులు కొయ్యాడ సుమన్, బత్తిని వేణు, కడకంచి గట్టయ్య, సిరికొండ రాజు, బండ్రు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగపూరి రాజయ్య గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగపూరి రాజయ్య గౌడ్ నియమిస్తూ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలో ఉన్నటువంటి గౌడ కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సేవలను గుర్తించి నాగపూరి రాజయ్య గౌడ్ ను తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగపూరి రాజయ్య గౌడ్ మాట్లాడుతూ గౌడ కుల అభివృద్ధికి, తెలంగాణ గౌడ సంఘం ఆశయాలకు, లక్ష్యాలకు, సంక్షేమం కోసం, గౌడులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కృషి చేస్తానని, నాపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు గాను రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల భరత్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారగోని కుమారస్వామి గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బయ్యాగోని కుమారస్వామి గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, నర్మెట వేణు గోపాల్ గౌడ్, జనగాం రమేష్ గౌడ్, హరీష్ గౌడ్, బుర్ర శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సాక్షం అంగన్వాడీ కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని వల్లెంకుంట సెక్టార్ పరిధిలోని కొండంపేట-1 అంగన్వాడీ కేంద్రం ఇటీవల సాక్షం అంగన్వాడీ కేంద్రంగా గుర్తింపు పొందగా సోమవారం అంగన్వాడీ కేంద్రంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. సాక్షం అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, తల్లులకు మరింత పోషకాహార విలువలు అందించే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి రజిత, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కలెక్టర్, ఎస్పీలు న్యాయం చేయండి

### బాధితుడు చిట్టిమల్ల సురేష్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా పరిధిలోని పెద్దవంగర మండలం గంటకుంట్ల గ్రామ శివారులోని 5 ఎకరాల 21 గుంటలు సర్వే నెం. 352, 353, 354, 360, 364లో చిట్టిమల్ల సురేష్ వ్యవసాయ భూమిలో పొలం పనులు చేసుకుంటుండగా పనులు చేసుకోకుండా కొన్ని సంవత్సరాల నుంచి కొందరు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితుడు చిట్టిమల్ల సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రం అందజేసిన అనంతరం చిట్టిమల్ల సురేష్ మాట్లాడుతూ పెద్దవంగర మండలం గంటకుంట్ల గ్రామ శివారులోని 5 ఎకరాల 21 గుంటలు సర్వే నెం. 352, 353, 354, 360, 364 లో వ్యవసాయ భూమిలో మేము పొలం పనులు చేసుకుంటుండగా మా బంధువు చిట్టిమల్ల సోమయ్య ప్రోద్బలంతో కొరిపెల్లి గ్రామానికి చెందిన నక్క ఉప్పలయ్య, నక్క దయాకర్ అనే వ్యక్తులు చెప్పవీలు కానీ విధంగా దుర్భాషలాడుతూ మాపై దాడి చేసి చంపుటకు ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయమై అదే రోజు పెద్దవంగర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. కానీ, ఆ ఫిర్యాదుపై పోలీస్ వారు స్పందించి తగు చర్య తీసుకోకపోగా మాపైనే కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ భూమిపై దావా తొర్రూరు కోర్టులో నడుస్తున్నదన్నారు. కోర్టు నుంచి తమకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ సదరు వ్యక్తులు మా భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి మాపైన దాడి చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి తగు సాక్ష్యాధారాలతో పోలీస్ వారికి ఫిర్యాదు ఇచ్చినప్పటికీ కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ను బేఖాతరు చేస్తూ అసలు నేరస్తులను వదిలేసి మాపైనే తప్పుడు కేసు నమోదు చేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా తప్పుడు కేసు బనాయించి మమ్మల్ని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై తగిన చర్య తీసుకోగలరని, అదేవిధంగా మా భూమిలోకి అక్రమంగా ప్రవేశించి నానా దుర్భాషలాడుతూ మాపైనే దాడి చేసి మమ్మల్ని చంపడానికి ప్రయత్నించిన చిట్టిమల్ల సోమయ్య ,అతని అనుచరులైన నక్క ఉప్పలయ్య, నక్క దయాకర్ నుంచి మాకు ప్రాణహాని ఉన్నందున మాకు రక్షణ కల్పిస్తూ విచారణ చేసి వారిపై చట్ట రీత్యా తగు చర్యలు తీసుకోగలరని సురేష్ కోరారు.

## హైడ్రాపై బీఆర్ఎస్, బీజేపీ మొసలి కన్నీరు



**వరంగల్వాయిస్, హైదరాబాద్ :** రాజకీయ కుట్రలో భాగంగానే హైడ్రాపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మొసలి కన్నీరుకారుస్తున్నారని సుధాకర్ గౌడ్ అన్నారు. చెరువులు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు నాలాలు, మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని గతంలోనే సర్వోన్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తీర్పులున్నాయి. దానిపై ఎవరు మాట్లాడినా కోర్టు ధిక్కరం కింద సుమోటోగా కేసులు నమోదు చేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ రూల్స్ ప్రకారంగా ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్, రోడ్డు విస్తరణలో ప్రజా ప్రయోజల కోసం విధి విధానాలు ఖరారు చేస్తూ జీవో ఎంఎస్ నెం 168 విడుదల చేయడం జరిగింది. దాని ప్రకారంగా ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో ఎవరిదైనా పట్ట భూమి ఉన్నా ఎటువంటి నిర్మాణాలు చేయవద్దని నిభందనలు చెబుతున్నాయని తెలిపారు. పట్టా భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇచ్చే ఆలోచన ప్రభుత్వంలో ఉంది. అలాంటి వారికి గతంలో టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. కొంత మంది ఆక్రమణ దారులు, భూ భకాసురుల ధన దాహానికి చెరువులు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే.. తెలిసి తెలియక అందులోని ఇళ్లను కొనుగోలు చేశారు. అలా నష్టపోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. కొంతమం ది అదే పనిగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. న్యాయ పరమైన చిక్కులను, అడ్డంకులను ఎదుర్కుంటూ ఎలాంటి తరమత భేదం లేకుండా భావితరాలకు సుందరమైన నగరాన్ని అందించాలని రేవంత్ రెడ్డి కలలను నిజం చేస్తూ హైడ్రా ముందుకు సాగాలని కోరారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వరంలో మహబూబాబాద్ షీ టీం ఎస్ఐ సునంద సోమవారం మహబూబాబాద్ పట్టణంలోని పులిపాటి ప్రసాద్ వొకేషనల్ జూనియర్ కాలేజ్ లో విద్యార్థినీ విద్యార్థులకు షీ టీమ్స్, మహిళల భద్రత, రక్షణ, ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ మత్తు పదార్థాలపై, భరోసా విధులు, అది ఏ విధంగా పనిచేస్తుందనే విషయాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఈవ్ టీజీంగ్ కు గురైనప్పుడు షీ టీంని ఎలా సంప్రదించాలి, పిటిషన్ ఏ విధంగా ఇవ్వాలనే విషయాలపై వివరించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా టీ-సేఫ్ యాప్ గురించి వివరిస్తూ దీనినే క్లుప్తంగా ట్రావెల్ సేప్ అని పిలుస్తారని, ఈ యాప్ ను ప్రతి ఒక్కరు డౌన్ లోడ్ చేసుకొని ఉపయోగించుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ లేని వాళ్లు ప్రయాణానికి ముందు 100కు డయల్ చేసి ఐవీఆర్ ద్వారా 8 నెంబర్ ని క్లిక్ చేసి వివరాలను తెలియజేస్తే మానిటరింగ్ స్టార్ట్ అవుతుందని పేర్కొన్నారు. మన లొకేషన్ ను సెల్ టవర్ ఆధారంగా పోలీసులు గుర్తిస్తారు. రిక్వెస్ట్ పెట్టాక ప్రతి 15 నిమిషాలకు ఫోన్ ఆటోమేటిక్ సేఫ్టీ మెసేజ్ లేదా కాల్ వస్తుంది. వాటికి స్పందిస్తే మనం సురక్షితంగా ఉన్నామని పోలీసులు ధృవీకరించుకుంటారు. లేదంటే లొకేషన్ ఆధారంగా పోలీసులు మనం ఉన్న చోటుకు వచ్చేస్తారని విద్యార్థిని విద్యార్థులకు టీ-సేప్ యాప్ గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది. స్మార్ట్ ఫోన్ ఉన్నవాళ్లు ఈ ట్రావెల్ షేప్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ సిబ్బంది ఏఎస్ఐ ఆనందం, అరుణ, పార్వతి రమేష్, భరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ సాహితీ, భరోసా సపోర్టు పర్సన్ బేబీ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సుప్రజ, పులిపాటి ప్రసాద్, ఒకేషనల్ జూనియర్ కాలేజ్ అధ్యాపక సిబ్బంది, జరీనా, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

## నేరాల అదుపులో విద్యార్థులది కీలకపాత్ర



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ అన్నారు. ఏకాశిల డీజీ హైస్కూల్ కాశిబుగ్గలో దాదాపు 300 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, టీ-సేఫ్ ఆప్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై, టీ-సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలి. అన్నోన్ నెంబర్స్ నుంచి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కి ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏకాశిల డీజీ హైస్కూల్ డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి, వైస్-ప్రిన్సిపాల్ ఏ.లవకుమార్, టీచర్స్ కే.నరేష్, ఎం.స్వప్న లత, పి.శ్రీనివాస్, కే.సుధాకర్, వంశీకృష్ణ, ఎల్.హర్షిత, షీ టీమ్ నుంచి హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ, కానిస్టేబుల్ కే.వంశీకృష్ణ, ఉమెన్ కానిస్టేబుల్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా

### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** విద్యార్థులు ఏడ్యుకేషన్, హెల్త్, సెల్ఫ్ ప్రొటెక్షన్ పైన మాత్రమే దృష్టి సారించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యా శాఖ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల హెల్త్ కార్డుల పంపిణీ కార్యకమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో పాల్గొని విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు శరీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. థైరాయిడ్, పీసీఓడీ సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సోషల్ మీడియాకు అట్రాక్ట్ అవకుండా చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. ఐనవోలులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆరోగ్య సిబ్బంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, డీఈవో వాసంతి, డీఎంహెచ్ఓ లలితా దేవి, తహసీల్దార్ విక్రమ్, విద్యా, ఆరోగ్య శాఖ అధికారులు, విద్యార్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేయి స్తంబాల దేవాలయంలో స్వచ్ఛత హీ సేవ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వచ్ఛతహీసేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో చారిత్రాత్మక పుణ్యక్షేత్రం వేయి స్తంభాల దేవాలయంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మై భారత్ జిల్లా అధికారి అన్వేష్ చింతల నాయకత్వంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ సూరునేని, కేంద్ర పురావస్తు శాఖ ఉమ్మడి జిల్లా అధికారి మల్లేషం ముఖ్య అతిథులుగా పాల్గొని స్వచ్ఛతహీసేవ ర్యాలీ, వేయి స్తంభాల దేవాలయంలో స్వచ్ఛ భారత్ నిర్వహించడంతో పాటుగా, పరిశుభ్రత గురించి భక్తులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్యక్రమ కోఆర్డినేటర్ ఎం.రాము ఆధ్వర్యంలో సుమతి రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణంలోని వివిధ చోట్ల స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి చెత్తను శుభ్రం చేశారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా స్వచ్ఛతహీసేవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మై భారత్ నూతన పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా అధికారి అన్వేష్ చింతల, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ సూరునేని, కేంద్ర పురావస్తు శాఖ ఉమ్మడి జిల్లా మల్లేషం, అసిస్టెంట్ ప్రొఫెసర్ , కార్యక్రమ కోఆర్డినేటర్ ఎం.రాము పాల్గొన్నారు.

# స్నేహశీలి శ్రీధర్ల ధర్మేంద్ర : ఎమ్మెల్యే నాయిని

## ఘనంగా పదవీ విరమణ సన్మాన మహోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్)లో కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేసి నేడు పదవీ విరమణ పొందుతున్న ఎస్ ధర్మేంద్ర పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయుడిగా ఎస్.ధర్మేంద్ర తన ప్రస్థానాన్ని ప్రారంభించి, జూనియర్ కాలేజి లెక్షరర్ గా, ప్రిన్సిపాల్ గా పనిచేసి అధ్యాపక వృత్తికి వన్నె తెచ్చిన మంచి స్ఫూర్తి దాయకుడు,స్నేహశీలి, సమాజ సేవకుడు ధర్మేంద్ర అని అన్నారు. అనంతరం అధ్యాపక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభ కు హాజరైన గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి, సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర



ప్రిన్సిపాల్ ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ కుమార్ లు మాట్లాడుతూ నేడు పదవి విరమణ పొందుతున్న ఎస్ ధర్మేంద్ర పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు అధ్యాపకుడిగా పనిచేసి ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా, ఇతరులకు మార్గదర్శకంగా ఉంటూ, ప్రిన్సిపాల్ గా, ఒక మంచి అడ్మినిస్ట్రేటర్ గా తన బాధ్యతలు నిర్వర్తిస్తూ, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ర్యాంకులు సాధించే విధంగా ప్రణాళికను రూపొందించి, అధ్యాపకులతో కలిసి ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి కృషి చేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. తన భావి జీవితం అష్ట ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం అధ్యాపక సంఘాల నాయకులు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ ఏ.గోపాల్, జీజేఎల్ఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ.శ్రీనివాస్ రెడ్డి, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సంఘాల నాయకులు, అధ్యాపకులు, రిటైర్డ్ అధికారులు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ సమీక్ష



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల గురించి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లతో సోమవారం ఎంపీడీఓ మాలోతు శంకర్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2న గ్రామ సభలు నిర్వహించాలని, లేబర్ బడ్జెట్ తయారు చేసి బడ్జెట్ కు అనుగుణంగా ప్రతి గ్రామంలో 3 నుంచి 4 రోజులు టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ కలిసి ఉపాధి హామీ పనులు గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 266 రకాల పనులు ఉన్నాయని, అందులో గ్రామానికి అవసరం ఉన్న పనులు గుర్తించాలని తెలిపారు. అలాగే నర్సరీలో డిమాండ్ ప్రకారం మొక్కలు పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుశీల్ కుమార్, ఈసీ రాజు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పలు పాఠశాలలను మండలవిద్యాశాఖాధికారి బైరి సరళ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. మండలంలోని గుడ్ షెప్పర్డ్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల పాపయ్యపేట్, హైస్కూల్ పాపయ్యపేట్ పాఠశాలలను సందర్శించడం జరిగింది. ఈ సందర్శనలో గుడ్ షెప్పర్డ్ ప్రైవేట్ పాఠశాల గుర్తింపు పత్రాలను, సెక్షన్ గుర్తింపు పత్రాలను, పాఠశాలలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే యూ డైస్ ఫార్మాట్ ను నేడు ఎంఆర్ సీ కార్యాలయంలో అందించాలని, ఫార్మటివ్ 1, 2 రిజల్ట్ ను ఆన్ లైన్ లో త్వరగా అప్ లోడ్ చేయాలని తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ వారి ఆదేశాలను పాటించాలని సెలవులలో పాఠశాలను నడుపకూడదన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు న్యాస్ మోక్ టెస్ట్ రిజల్ట్ ను, ఫార్మటివ్ 1,2 టెస్ట్ ల మార్కులను త్వరగా అప్ లోడ్ చేయాలని తెలిపారు. యూ డైస్ ఫార్మాట్స్, సెప్టెంబర్ మాసం మధ్యాహ్న భోజన రిపోర్ట్స్ లను ఎంఆర్సీ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఉపాధ్యాయుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. పాపయ్యపేట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బోయినపెల్లి ప్రభాకర రావు, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, కుమారస్వామి, శాంతా మేరీ, శ్రావణ్, రవీందర్, యాకుబ్, శేఖర్ బాబు, సీఆర్పీ బాలు పాల్గొన్నారు.

# సమాన హక్కులకై మహిళలు సంఘటితంగా పోరాడాలి

## ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర ప్లీనరీలో కుంభం సుకన్య




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజంలో సగభాగమైన మహిళలకు సమాన హక్కులు కల్పించకుండా అణిచి వేస్తూ పాలకుల దోపిడి విధానాలలో మహిళలను సమిధలుగా మారుస్తున్నారని, మహిళా లోకం సంఘటితంగా ఐక్య పోరాటాల ద్వారా స్వేచ్ఛ సమానత్వాన్ని సాధించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్ డీడబ్ల్యూ) కేంద్ర కమిటీ సభ్యులు కుంభం సుకన్య పిలుపునిచ్చారు. సోమవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్ డీడబ్ల్యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు రాష్ట్ర అధ్యక్షురాలు వస్కుల సైదమ్మ అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్ ఆవరణలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ సృష్టికి ప్రధాన మూలమైన మహిళలు ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తూ అన్ని రంగాల్లో రాణిస్తూ కుటుంబ వ్యవస్థను చక్క దిద్దుతున్నారని, అలాంటి మహిళా లోకాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ముందుకు రానివ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణిచివేస్తున్నాయని మండిపడ్డారు. పైగా పెట్టుబడి దారి దోపిడి వర్గాలకు అనుకూలంగా విధానాల రూపొందిస్తూ పాశ్చాత్య సంస్కృతిని పెంపొందిస్తూ మార్కెట్ వ్యవస్థలో మహిళను అంగడి బొమ్మగా చిత్రీకరిస్తున్నారని, దీంతో చిన్న పెద్ద అని తేడా లేకుండా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాదం సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేస్తూ కేవలం పురుషులకు సేవలు చేస్తూ సుఖాన్ని అందించడానికి మహిళలు అన్నట్లు చిత్రీకరిస్తున్నారని, ఇది సమాజానికి ఎంతో ప్రమాదకరమని హెచ్చరించారు. దీనికి తోడు అసభ్యకరమైన రీతిలో అశ్లీల సినిమాలు వెబ్ సైట్స్, డ్రగ్స్, మత్తు పానీయాలతో మహిళలపై మరిన్ని దాడులకు గురవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు రాజకీయాలకతీతంగా సంఘటితంగా, లింగ వివక్షతకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, సమానత్వం, మహిళా హక్కులకై అకుంఠిత దీక్షతో ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐఎఫ్ డీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడిగా అంగడి పుష్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వంగల రాగసుధ, కోశాధికారిగా తాండ్ర కళావతి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కుంభం సుకన్య, వస్కుల సైదమ్మ, మాస్ సావిత్రి, కనకం సంధ్య, జి.శివానీ, గటికె మమత, పేర బోయిన రమ, ఏ.ప్రేమలత, చంద్రకళ, జ్యోతి, రమణ, సుకన్య, విమల, పుష్పలత, అనిత, అమీనా, ఇందిరా, ఇందు, వలిపీ రెడ్డి, సరోజన, కోఆప్షన్ సభ్యులుగా మరి కొంతమంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బతుకమ్మ దుస్తులు పంపిణీ




**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ప్రభుత్వ విద్యార్థులే ప్రగతికి చోదక శక్తులు, సామాజిక మార్పుకు దోహదపడతారని జీఎస్టీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ ఎడ్ల శ్రీలీల అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మసాగర్ లో ఫ్రెషర్స్ డే, బతుకమ్మ దుస్తుల పంపిణీ వేడుకలకు ముఖ్య అతిథిగా శ్రీలీల హాజరై మాట్లాడుతూ సమాజాన్ని ఒక తోపు తోయడానికి చదువు ముఖ్య సాధనమని అన్నారు. భవిష్యత్ లో ఏమీ కావాలన్న ఇంటర్ దశలోనే నిర్ణయించుకోవాలని, లక్ష్యం సాధించే వరకు మేల్కొని ఉండాలని, నిత్య సాధన చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, సమాజం పెట్టుబడితో మనం చదువుకుంటున్నామని, ఈ విషయాన్ని గుర్తెరిగి క్రమశిక్షణ, బాధ్యతతో విద్యార్థులు మసులుకోవాలని కోరారు. ఇంటి పనులు, ఆటల శ్రమతో శరీరం, ఆలోచన, ప్రశ్న, అధ్యయనం రాయడంతో మెదడు వికాసం చెందుతాయన్నారు. కాబట్టి, శ్రమను ప్రేమించడం జీవిత ప్రధాన లక్ష్యం కావాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సామాజిక హోదాను, రాజ్యాంగ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేసే అవకాశాన్ని కల్గిస్తాయని అన్నారు. గృహిణిగా ఉంటూ దూర విద్య ద్వారా డిగ్రీలు చేసి ఎన్నెన్నో అవరోధాలను ప్రతికూలతలను అధిగమించి గ్రూప్ వన్ పరీక్షలో నెగ్గి జాయింట్ కమిషనర్ గా ఎదిగిన తీరును విద్యార్థులకు చెప్పి ఉత్తేజపర్చారు. ప్రభుత్వ విద్యా సంస్థల నుంచి వచ్చిన వారు ఉత్తమ పాలకులుగా, అధికారులుగా ఉంటున్నారని తెలిపారు. కళాశాలను కుటుంబంగా భావించి విద్యార్థుల ప్రగతి కోసం ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ చేస్తున్న కృషి రాష్ట్రంలో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ విద్య కోసం ధర్మసాగర్ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులను అభినందించారు.

## మహిళల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మహిళల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు బండి పద్మ అన్నారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో మహిళ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బండిపద్మ ఆధర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ ధోని కమలమ్మ, సీనియర్ నాయకులు బాదావత్ వీరు, అక్కల్ చెడ గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లావుడ్యా వెంకన్న, చెక్క రమ, హంస, మల్లికాంబ, రేణుక, సునీత, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

## సపోర్టింగ్ స్టాఫ్ జీతాలు పెంచాలి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రభుత్వ హాస్పటల్ లో పనిచేస్తున్న ఆల్ సపోర్టింగ్ స్టాఫ్ కు కనీస వేతనం అమలు చేయాలి సోమవారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఆల్ సపోర్ట్ స్టాఫ్ కు ప్రస్తుతం వేతనం రూ.10,000 రూపాయలు ఇస్తున్నారు. జీ.ఓ.60 ప్రకారం నెలకు 15వేల 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వెంటనే వేతనాలు పెంచి చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.వీరందరికీ సుప్రీంకోర్టు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, బేసిక్ పే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సబిత, రామనాథం, సమ్మయ్య, వనమాల పాల్గొన్నారు.




# నారాయణమంత్రంపై కీరవాణి ఆడియో

ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం. ఎం. కీరవాణికి ధన్యవాదాలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓ ప్రకటనను విడుదల చేశారు. తిరుమల మహా ప్రసాదం అయిన లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై పవన్ కళ్యాణ్ ఈ ఆవేదన నిమిత్తం ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాయశ్చిత్త నిమిత్తం అంతా నారాయణ మంత్రం పఠిస్తున్నారు. అలా నారాయణ మంత్రం పఠించే వారందరి కోసం సంగీత దర్శకుడు కీరవాణి ఓ ఆడియో రికార్డ్ చేశారు. ఆడియో రికార్డ్ చేసిన కీరవాణికి, ఆయన టీమ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. జనసేన పార్టీ తరపున పవన్ కళ్యాణ్ అధికారికంగా ఓ ప్రకటనను విడుదల చేశారు. అందులో.. 'ఓం నమో నారాయణాయ' మంత్రాన్ని ప్రజానీకం పఠించేందుకు అనువుగా ఆడియో రికార్డు రూపొందించిన ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తిరుమల మహా ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం భక్తి భావం కలిగిన ప్రతి ఒక్కరికీ తీవ్ర ఆవేదన కలిగించింది. ఈ ఆవేదన నుంచే ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించాను. ఈ దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులతో పాటు ధార్మిక విశ్వాసాలు కలిగినవారందరూ ఆలయాల్లో పూజలు, హోమాలు, భజనలు చేస్తున్నారు. వారంతా ఓం నమో నారాయణాయ మంత్రం పఠిస్తున్నారు. అందుకు అనువుగా కీరవాణి ఆడియో రికార్డు చేశారు. భక్తి భావంతో సాగింది. ఇందులో భాగం పంచుకున్న సంగీత కళాకారులకి, సాంకేతిక నిపుణులకి ధన్యవాదాలు. ధర్మో రక్షతి రక్షిత:' అని పేర్కొన్నారు.

# మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు




మన దేశంలో సినీ రంగానికి సంబంధించి ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'దాదా సాహెబ్ ఫాల్కే' ప్రధానమైనది. ఈ ఏడాది అవార్డుకు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 8న జరగనున్న జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర, సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ పోస్ట్ పెట్టారు. మిథున్ చక్రవర్తి అద్భుతమైన సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ ఏడాది దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనకు అందించాలని జ్యూరీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. మిథున్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ చలన చిత్ర రంగానికి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉంది. విభిన్నమైన నటనతో ఆయన ఎన్నో తరాలను అలరించారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ఆయనకు నా అభినందనలని ప్రధాని పేర్కొన్నారు. ఈ పురస్కారానికి తాను ఎంపిక కావడంపై మిథున్ ఆనందం వ్యక్తంచేశారు. మాటలు రావడం లేదు. ఇలాంటి గొప్ప విజయాన్ని నేను అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉన్నా. నా కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దీనిని అంకితం చేస్తున్నానని తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. బాలీవుడ్‌లో ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేసి పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. హీరోగానే కాకుండా సహాయనటుడు, విలన్‌గా కూడా ఆయన ఎంతోమంది స్టార్ హీరోల చిత్రాల్లో నటించారు. 1976లో 'మృగాయ'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. 'ముక్తి', 'బన్సారీ', 'అమర్‌దీప్', 'ప్రేమ్ వివాహ్', 'భయానక్', 'కస్తూరి', 'కిస్మత్', 'మే ఔర్ మేరా సాథి', 'సాహాస్', 'వాంటెడ్', 'బాక్సర్', 'త్రినేత్ర', 'దుష్మన్', 'దలాల్', 'భీష్మ', 'సుల్తాన్', 'గురు', 'కిక్', 'బాస్', డిస్కోడాన్సర్ వంటి చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. హిందీ, బెంగాలీ చిత్రాలతోపాటు కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ ఆయన నటించారు. 'గోపాల గోపాల'తో తెలుగు వారికి సుపరిచితమయ్యారు. ఇందులో ఆయన ప్రతినాయకుడిగా కనిపించారు. అనంతరం 'మలుపు' అనే టాలీవుడ్ మూవీలోనూ ఆయన యాక్ట్ చేశారు. 'ఐ యామే డిస్కో డాన్సర్' అన్న పాటతో దేశవిదేశాల్లో గుర్తింపు తెచ్చుకొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆయనకు పద్మభూషణ్ అవార్డును కేంద్రం అందజేసింది.



## ఫాల్కే అవార్డుపై పవన్, బాలయ్య హర్షం


అత్యంత ప్రతిష్టాత్మకమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డుకు ఎంపికైన మిథున్ చక్రవర్తికి ప్రస్తుతం శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం మరియు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రముఖ నటులు, రాజ్యసభ సభ్యులు మిథున్ చక్రవర్తిగారికి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషాన్ని కలిగించింది. నటసింహం నందమూరి బాలకృష్ణ 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారానికి ఎంపికైన మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ ఓ లేఖను విడుదల చేశారు. ఇందులో..విలక్షణ నటుడు, మిత్రుడు మిథున్ చక్రవర్తికి ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం హర్షించదగ్గ విషయం. మిథున్ నటునిగా మరెన్నో విలక్షణమైన పాత్రలలో మురిపిస్తూ సాగాలని ఆశిస్తున్నాను..' అంటూ నందమూరి బాలకృష్ణ ఈ లేఖలో పేర్కొన్నారు.



# జీబ్రా టీజర్ విడుదల



యువ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా' లక్ ఫేవర్స్ ది బ్రేవ్.. అన్నది ఉపశీర్షిక. ఈ సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. మత్తు వదలరా ఫేం సత్య కూడా టీజర్‌లో మరోసారి నవ్వులు పూయించాడు. ప్రియా భవానీ శంకర్ , జెన్నిఫర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) విలన్ పాత్రలో నటిస్తున్నాడు. సునీల్ సత్యరాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.






## కనకదుర్గమ్మను దర్శించుకున్న కార్తీ

ప్రముఖ తమిళ నటుడు కార్తి విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన నటించిన 'సత్యం సుందరం' చిత్ర ప్రచారంలో భాగంగా కార్తీ విజయవాడ వచ్చారు. చిత్ర బృందంలో కలిసి ఇంద్రకీలాద్రికి వచ్చిన కార్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. 'సత్యం సుందరం' చిత్రం మంచి ఆదరణ పొందుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, సెప్టెంబర్ 30, 2024

# ఇంటికి ఆధారం ఇల్లాలే..

- ఆరోగ్యం విషయంలో అవగాహన పెంచుకోవాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** మహిళా సాధికారత అంటే మహిళలు ఆర్థికంగా బలంగా ఉండడమే కాదు ఆరోగ్యంగా కూడా ఉండాలని అప్పుడే దేనినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండగలమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పోషణ్ అభియాన్, పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ నెలలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పోషణ, పోషకహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అభినదనీయమని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని పనులు సమర్థవంతంగా చేసుకోగలమని అన్నారు. మహిళలల్లో రొమ్ము క్యాన్సర్, గర్భశాయ క్యాన్సర్ వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని, ఇలాంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించాలని లేకపోతే ప్రణాంతకం అయి ప్రాణాలకే ముప్పు వస్తుందని హెచ్చరించారు. మహిళలు ఎలాంటి భయందోళనలు లేకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణీలు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా ఉండాలని ఆమె సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మహిళలు, గర్భిణీలు, బాలింతలు, శిశువులు తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారం, పోషకాహార లోపాలపై అవగహన కల్పించారు. పౌష్టిక ఆహారలోపం వల్ల రక్త హీనత, జనన శిశువు బరువు తగ్గుదల మొదలగు ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయని చెప్పారు. గర్భిణీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టించాలని, ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే బిడ్డకు ఆహారంగా ఇవ్వాలని, తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో దోహద పడతాయన్నారు. గర్భిణీలు, బాలింతలు, శిశువులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టిక ఆహార పదార్థాలను సమయానికి అందజేయాలని అంగన్వాడీ టీచర్లకు, హెల్త్ వర్కర్లకు సూచించారు. పోషకార లోపాలను అదిగమించడానికి అంగన్వాడీ వర్కర్లు మహిళలలో అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని కడియం శ్రీహరి సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## పదవీ విరమణ వయసుకు మాత్రమే.. మనసుకు కాదు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని శివనగర్ కు చెందిన బీఎస్ఎన్ఎల్, ఉద్యోగి పెండెం సంజీవ్ జూనియర్ ఇంజినీర్ గా పదవీ విరమణ పొందిన సందర్భంగా శివనగర్ వేడుకల మందిరంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి హాజరై మాట్లాడుతూ పదవీ విరమణ వయసుకు మాత్రమే అని మనసుకు కాదన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కిషన్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, జూలపల్లి సంపత్ రావు, బి శ్రీనివాస్, రామ్మోహన్, రాజేందర్, కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, పోపా నాయకులు మాటేటి అశోక్ కుమార్, సంతోష్ శ్రీధర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెపల్లి కళాశాలలో బీజేపీ పరిశీలన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని వడ్డేపల్లి ప్రభుత్వ మహిళ జూనియర్ కాలేజీలో పలు సమస్యలు ఉన్నాయంటూ స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి కళాశాలను సందర్శించారు. అనంతరం ప్రిన్సిపాల్ తో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అమ్మాయిలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని, వాష్ రూంలకు తలుపులు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జన్ను మధు, రోకుల సతీష్, మహేందర్ పటేల్, అమృత రావు, చింతలపాణి అమరేందర్ రెడ్డి, శివరాం, కటకం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవలు.. నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నో త్యాగాలు, కష్టనష్టాలను అధిగమించి విజయవంతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న పోలీసుల చర్యలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ విభాగంలో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి సోమవారం పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘంనగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సీపీ పదవీవిరమణ పొందుతున్న ఎస్సైలు సయ్యద్ యూసుఫ్, కుమారస్వామిలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాతుడుతూ సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో పనిచేయడంమే కాకుండా క్లిష్టసమయాల్లో విధులు నిర్వహించి నేడు శాంతియుతమైన వాతరణం కల్పించడంలో వీరు ప్రధాన కారుకులన్నారు. ముఖ్యంగా పోలీసులు తమ విధుల్లో రాణించడం ప్రధాన కారణం అన్నారు. వారి కుటుంబ సభ్యులని, కుటుంబ సభ్యులు ఇచ్చిన సహకారంతోనే పోలీసులకు అప్పగించిన పనుల్లో రాణిస్తున్నారని, పోలీస్ కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ సురేంద్ర, ఆర్.ఐలు ఆర్.ఎస్.ఐలు పదవీవిరమణ పొందిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ బాహాబాహీ

- నయీమ్ నగర్ బ్రిడ్జిపై కొట్టుకున్న నేతలు
- రంగ ప్రవేశం చేసిన పోలీసులు
- వినయ్ భాస్కర్ అరెస్ట్, పోలీస్ స్టేషన్ తరలింపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు సోమవారం బాహాబాహికి దిగారు. ప్రజా క్షేత్రంలోనే ఒకరిపై ఒకరు దాడికి దిగారు. నయీమ్ నగర్ బ్రిడ్జిపైనే జరిగిన ఈ సంఘటనతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. అసలు ఏమి జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. రంగ ప్రవేశం చేసిన పోలీసులు అక్కడ గుమికూడిన పార్టీ శ్రేణులను చెల్లా చెదురు చేశారు. ప్రభుత్వ మాజీ విప్ దాస్యం వినయ భాస్కర్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు.



**బాహాబాహి..**

నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణంలో తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం సాగింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల చిరకాల వాంచ అయిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశామంటూ ప్రస్తుత ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించగా, బ్రిడ్జి నిర్మాణానికి ఆజ్యం పోసిందే మేమంటూ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ప్రకటించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షన వాతావరణం నెలకొంది. ఇద్దరు అక్కడికి చేరుకోవడంతో ఇరు పార్టీల శ్రేణులు వారి పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో ఒక్క సారిగా హీటెక్కిన వాతావరణం కొట్టుకునేందుకు దారి తీసింది.

**ఇలాంటి గుండాగిరి చూడలేదు..: వినయ భాస్కర్**

నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి గుండాల దాడిని ఎన్నడూ చూడలేదని, ఇది చాలా దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఉందని పోలీస్ వాళ్ళతో అరెస్ట్ చేయించడం, శిలా ఫలకాలు ధ్వంసం చేయడం తరగని హెచ్చరించారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఎమ్మెల్యే తనను టార్గెట్ చేస్తున్నాడంటూ ఆరోపించారు. అధికారాన్ని మంచికి ఉపయోగించాలంటూ హితవు పలికారు. అభివృద్ధి చేసి చూపించు..నిధులు తీసుకురా.. ఐటీ కంపెనీలు తీసుకురా అంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ లు సుందర్ రాజు, మర్రి యాదవ్ రెడ్డి, కార్పొరేటర్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నాయకులపై దాడిని ఖండిస్తున్నా..: ఏనుగుల రాకేష్ రెడ్డి**



ప్రశాంతంగా ఉన్న హనుమకొండలో స్వయంగా ఎమ్మెల్యేనే శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆరోపించారు. ఒక ప్రజాప్రతినిధి దిగజారి గాజులు, చీరలలో రోడ్లమీద నిలపడి సవాళ్లు చేయడం శోచనీయమన్నారు. వార్తల్లో నిలవడం కోసం అదుపుతప్పి మాట్లాడుతూ, ఏకంగా ఎమ్మెల్యేనే వీధి కొట్లాటలకు ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అశాంతి, విధ్వంసం, అరాచకం సృష్టించేందుకే ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com